డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 28వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 4వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

జలమండలి అధికారులను కలిసిన కార్పొరేటర్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 25: తమ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్, డీపీ సుభాష్‌లను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. రానున్న ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి కొరత ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ విషయంలో లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లపై జరుగుతున్న సర్వే సరళని అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాల్లో మల్లయ్యది ప్రముఖ పాత్ర



మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ కృష్ణ మోహన్‌రావు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24: గంగపుత్రుల హక్కుల సాధనతో పాటు తెలుగు రాష్ట్రాల బీసీ ఉద్యమ నిర్మాణాల్లో ప్రముఖ పాత్ర వహించిన ఏఎల్ మల్లయ్య చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, గంగపుత్ర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఎల్ మల్లయ్య రెండో వర్ధంతి నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్స్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ప్రొఫెసర్లు సుదర్శన్‌రావు, మురళిమనోహర్, బాగయ్య, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నరసయ్య, ఏసీపీ సంపత్ హాజరై మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే గోపాల్, కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ బీసీ కులాలన్నీ ఒక తాటి మీదికి వచ్చి రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులను ఉపయోగించుకోవాలని అన్నారు. మల్లయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూస నరసింహ, లక్ష్మణ్, మల్లేశ్, శివరత్నం, సంగీత, రామచందర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి పాటుపడిన గొప్ప నాయకుడు

కవాడిగూడ: గంగపుత్రుల అభివృద్ధికి పాటుపడిన గొప్ప నాయకుడు ఏఎల్ మల్లయ్య అని గంగపుత్ర సంఘం నాయకులు అన్నారు. మల్లయ్య ద్వితీయ వర్ధంతిని లోయర్ ట్యాంక్ బండ్‌లోని బండమైసమ్మనగర్‌లో మల్లయ్య విగ్రహానికి తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్, బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీల ఏబీసీడీ వర్గీకరణ అంశంలో ఏఎల్ మల్లయ్య ముఖ్యభూమిక పోషించారని తెలిపారు. హక్కుల సాధన కోసం గంగపుత్రులంతా సంఘటితంగా ఐక్య పోరాటాలు సాగించాలని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకున్నప్పుడే మల్లయ్యకు నిజమైన నివాళి అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పలువురు సంఘం నాయకులు, బీసీ సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 25: రంజాన్ మాసం సమీపిస్తుండటంతో మసీదుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మసీదు, ప్రార్థన స్థలాల వద్ద పారిశుధ్యం, మంచినీరు, విధి దీపాలు, పుట్‌పాత్‌లు, రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రామను జారెడ్డి, డీఈ పన్నీ, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ సమీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: రంజాన్ ప్రార్థనలు విజయవంతంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లపై, గ్రేటర్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత తార్నాకలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి, సికింద్రాబాద్ నియోజకవర్గ మసీదుల పెద్దలు, ప్రభుత్వ అధికారులు, పోలీస్, జల మండలి, విద్యుత్, జీహెచ్ఎంసీ విభాగం అధికారులు పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ మసీదుల ప్రాంతాల్లో శుభ్రతను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. రోడ్ల మరమ్మతులు చేసి, నాణ్యమైన రహదారులను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎంటమాలజీ విభాగం ద్వారా దోమల నివారణకు ప్రతి రెండో రోజు మసీదుల వద్ద ఫాగింగ్ చేయాలని ఆదేశించారు.

మఖ్దూమ్ మొహియుద్దీన్‌కు నివాళి

మఖ్దూమ్ మొహియుద్దీన్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ముషీరాబాద్ ఫిబ్రవరి 25. చిక్కడపల్లి త్యాగరాయ గణసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధురస్మృతులతో భాగంగా మంగళవారం కవి, రచయిత మఖ్దూమ్ మొహియుద్దీన్ జయంతి సభ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూద నాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మఖ్దూం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడిగా, కార్మిక నేతగా, రచయితగా విశేష సేవ అందించారని కొనియాడారు. ఫాసీజానికి వ్యతిరేకంగా పోరాడి, సమసమాజ స్థాపన కోసం కృషిచేశారని అన్నారు. ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన పోరాడి, నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళామూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సామాజికవేత్త మూర్తి, గాయని ఆమని, సుమిత్ర శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

నాన్ ముల్కీ.. నార్త్ ఇండియా గో బ్యాక్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రంగాల్లోని ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. నాన్ ముల్కీ నార్త్ ఇండియా గో బ్యాక్ అంటూ నినదించారు. తార్నాక లోని జేఏసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ నాన్ ముల్కీ నార్త్ ఇండియా గో బ్యాక్ అనే నినాదంతో వచ్చేనెల 3న సాయంత్రం మూడు గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దక్షిణాది జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 75 శాతం రాష్ట్ర నిరుద్యోగులకు, మిగిలిన 25 శాతం దక్షిణాది వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికులకు వ్యాపార, వాణిజ్య రంగాలతో పాటు అన్నిరంగాల్లో వాటా దక్కాలని ఆయన అన్నారు. ఉత్తరాది రాష్ట్రాల వారు స్థానికుల అవకాశాలను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణాది వారి పరిరక్షణ కోసం డీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో జేఏసీ కోచైర్మన్లు నకిరేకంటి సంజీవరావు, నడిమి దొడ్డి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

తార్నాకలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నినదిస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, తదితరులు

చంద్రమౌళీశ్వర ఆలయంలో పూజలు

స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తున్న రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, ఆలయ కమిటీ సభ్యులు

బొల్లారం, ఫిబ్రవరి 25: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ బొల్లారం డాటన్ బజార్లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పవన్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్, జాయింట్ సెక్రెటరీ రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వేణుగోపాల్, జనరల్ సెక్రెటరీ ప్రభాకర్ రావు, కోశాధికారి అనిల్‌యాదవ్, కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు రావుల సతీష్ తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగ విరమణ అనివార్యం

ఎస్సై వీరస్వామి దంపతులను సత్కరిస్తున్న ఏసీపీ రమేష్, సీఐ శ్రీనివాస్, రామకృష్ణ

బొల్లారం, ఫిబ్రవరి 25: ఉద్యోగ విరమణ అనివార్యమని, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని తిరుమలగిరి ఏసీపీ రమేష్ అన్నారు. మంగళవారం బొల్లారం పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై వీరస్వామి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్సై వీరస్వామిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన వీరస్వామి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్ఖాన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, బొల్లారం పీఎస్ ఎస్సైలు రామకృష్ణ, చంద్రయ్య, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనుల పరిశీలన

పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్ పేట్, ఫిబ్రవరి 25: స్వామి వివేకానంద కమిటీ హాల్ వద్ద ప్రజల కోసం పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర నూతన పార్క్ పనులను స్థానిక కార్పొరేటర్ కె.హేమలత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇక్కడ పార్కును అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ లోని ఉద్యానవన విభాగానికి ఆదేశించారని తెలిపారు. పార్కు అభివృద్ధి పనులు పూర్తిగా కావొచ్చాయని, త్వరలో ప్రజల కోసం అందుబాటులోకి తీసుకొస్తామని ఆమె చెప్పారు. కమ్యూనిటీ హాల నిర్మాణం, నూతన సిమెంట్ రోడ్ల ఏర్పాటు, బస్తీలలో తాగునీరు, మురుగునీరు సమస్యల పరిష్కారం, కాలనీలలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని ఆమె అన్నారు. బన్సీలాల్ పేట్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ ఫహీమ్, బిఆర్ఎస్ నాయకులు కే లక్ష్మీపతి, వెంకటేష్, నర్సింగరావు, శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

కవాడిగూడ, ఫిబ్రవరి 25: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిం ది. దోమలగూడ ఎస్ఐ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెట్రోలింగ్‌లో భాగంగా ఈ నెల 10న ట్యాంక్‌బండ్ పైనుంచి వెళ్తున్న పోలీస్ సిబ్బంది కొంతమంది అక్కడ గుమిగూడి ఉండడం గమనించారు. గమనించగా గుర్తుతెలియని యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి కనిపించాడు. రోడ్డు దాటే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు దోమలగూడ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మరణించిన గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, ఫిబ్రవరి 25: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం మృతి చెందిన వ్యక్తి మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నరసింహ ఎస్సీఐకాలనీలోని సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి వివరాలు సేకరించారు. 35 నుంచి 40 ఏండ్ల వయస్సు గల యాచకుడు అయి ఉంటాడని, రెండు రోజుల క్రితం హాస్టల్ బాల్కనీలో పడుకోవడానికి వచ్చి చనిపోవడంతో మృతదేహం దుర్వాసనతో కుళ్లిపోయిన స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు ఎస్సై నర్సింహ తెలిపారు.

సైన్స్‌తోనే.. సమాజ పురోగతి

నమూనాల ప్రదర్శనలో విద్యార్థులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25: సైన్స్‌తోనే సమాజ పురోగతి సాధ్యమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం సుందరయ్య కేంద్రంలో సైన్స్ ప్రయోగాల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక అవసరాలతోపాటు ప్రపంచ సవాళ్లను సైన్స్ ప్రతిస్పందించాలని చెప్పారు. ఆరోగ్యం, వ్యవసాయ సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు ప్రభుత్వాలు చేయాలని సూచించారు. పాలకులు సైంటిఫిక్‌గా అక్షరాస్యులు కావాలని, లేకపోతే సమాజంలో మూఢనమ్మకాలు, అశాంతి కర్మ సిద్ధాంతం ముందుకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అజ్ఞానం రాజ్యమేలుతున్న తరుణంలో విజ్ఞానానికి పునాదులు వేద్దాన్నారు. సైన్స్ ఎంత అభివృద్ధి చెందిందన్నది విషయం కాదని, ప్రజలకు ఏ మేరకు అందుబాటులో ఉందనేదే ప్రధానమని అన్నారు. పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్‌ఎగ్జిబిట్స్ వీక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్.సోమయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, అంకమ్మ, బాలోత్సవం కోశాధికారి జి.బుచ్చిరెడ్డి నవీన్, బ్రాహ్మణి పాల్గొన్నారు.

మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి

బేగంపేట్, ఫిబ్రవరి 25: లక్ష్య సాధనలో ఎదురయ్యే అవాంఛిత ఆలోచనలకు యువత దూరంగా ఉండాలని, ఆత్మన్యూనత నుంచి ఆత్మవిశ్వాసం వైపు అడుగులు వేయాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంఏ కరీం అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని యూత్ హాస్టల్‌లో యువత కోసం యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ యూత్ ఎక్చేం జ్ ప్రోగ్రాం నిర్వహించారు. కరీం పాల్గొని యువత భావి జీవితానికి అద్దం పట్టే విధంగా మానసిక శక్తి కేంద్రీకరణ పద్ధతులు వాటి ఉపయోగాలపై శిక్షణ ఇచ్చా రు. ఆత్మగౌరవం, విశ్వాసం ఉంటేనే భవిష్యత్తులో విజయ శిఖరాలను అధిరోహించగలరని, యువత తమ ప్రతిభ, నైపుణ్యాలను అనుగుణంగా లక్ష్యాలను ఉన్నతంగా ఎదిగేలా తీర్చి దిద్దుకోవాలని చెప్పారు. ప్రతిఒక్కరిలో అజ్ఞాత శక్తి దాగి ఉంటుందని, దానిని వెలికి తీయాలని సూచించారు. యువత తమ లోపాలను స్వీయ విమర్శలను సానుకూలంగా తీసుకున్నపుడే తమ వ్యక్తిత్వాన్ని విజయం వైపు మలచుకోగలరని ఉద్బోధించారు. యువత మత్తు మాదకద్రవ్యాల వైపు వెళ్లకుండా అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్ప్ లైన్ లోగోను ఆవిష్కరించారు. మత్తు మాదకద్రవ్యాల నిర్మూలనకు హెల్ప్ లైన్ 94404 88571 లేదా 040-35717915 నంబర్లలో ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయం త్రం ఆరు వరకు మానసిక నిపుణులు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా యువజన అధికారిని ఖుష్బూగుప్తా, ప్రోగ్రాం అధికారి యాదగిరి యువజన సర్వీసుల శాఖ అధికారులు సిబ్బందితోపాటు తమిళనాడు నుంచి వచ్చిన యువకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు సహకరించాలి

బన్సీలాల్‌పేట్: బేగంపేట సర్కిల్ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం న్యూ బోయిగూడలోని సెయింట్ ఫిలోమినా హైస్కూల్లో విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన కల్పించారు. శానిటరీ సూపర్వైజర్ ధనగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి పరిసరాలతో పాటు పాఠశాలలు కూడా పారిశుధ్యం నెలకొల్పేందుకు సహకరించాలన్నారు. తడి, చెత్త పొడి చెత్తను వేర్వేరుగా చేసి రిక్షా వారికి అందజేయాలని, ప్లాస్టిక్‌ను నివారించాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు బాధ్యతగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సెయింట్ ఫిలోమినా హై స్కూల్ ప్రిన్సిపాల్, ఫాదర్ తుమ్మ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది గోవిందరాజ్, కృష్ణ, నర్సింగ్ రావు, రాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నిర్మూలన అందరి బాధ్యత

పోస్టర్‌ను విడుదల చేస్తున్న చిలకలగూడ డీఐ రమేష్, తదితరులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 25: వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిలకలగూడ డీఐ రమేష్ అన్నారు. మంగళవారం చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో దివ్య దిశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐ రమేశ్ హాజరై పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెడ్డిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన అన్నా రు. బడి ఈడు చిన్నారులను బడికి పంపించాల్సిందేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ పోలీసులు, దివ్య దిశ స్వచంద్ర సంస్థ వాలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పీఎస్‌ను సందర్శించిన అడిషనల్ సీపీ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 25 : పంజాగు ట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం అడిషనల్ సీపీ జోయల్ డేవిస్ సందర్శిం చారు. అడిషనల్ సీపీగా బాధ్యతలు తీసుకున్న డేవిస్ తొలిసారిగా పీఎస్‌కు వ చ్చారు. ఈ సందర్భంగా పలు రికార్డుల ను పరిశీలించారు. ట్రాఫిక్ సిబ్బంది అనునిత్యం కూడళ్ల వద్ద ఉంటూ అం తరాయం కలుగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ పోలీస్‌గా ప్రజలకు సేవలందిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయ న వెంట ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్, సీఐ బోసుబాబు, సిబ్బంది ఉన్నారు.

హైకోర్టు ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 25: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని జాతీయ సమతా లాయర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పుట్ట పద్మారావు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్‌లు కోరా రు. ఈమేరకు మంగళవారం వారు హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. హైకోర్టులో అంబేద్కర్ విగ్రహంను ఏర్పాటు చేస్తామని 2024 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంద ర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ హామీ ఇచ్చి పునాది వేయడం జరిగిందని తెలిపారు. త్వరలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేశ్, న్యాయవాదులు నరేంద్ర, నరసింహ, రమేశ్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ముషీరాబాద్, ఫిబ్రవరి 25: సారంగీ మ్యూజిక్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీసంగీత విభారి పలువురిని అలరించింది. సుమధుర సుస్వరాల రాగ మంజరి పేరిట నిర్వహించిన సంగీత విభావరి రంజింప చేసింది. ముఖ్యఅతిథిగా సాహితీవేత్త ఓలేటి పార్వతీశం పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సురేఖమూర్తి, టీవీ సుందర వల్లి శ్రీదేవి, శ్రీదేవి, స్వాతి లంక లక్ష్మీనారాయణ, సారంగీ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షురాలు కె.సుప్రియా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను సత్కరించిన పోలేటి పార్వతీశం